VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 7


పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 3 జూన్ 2026

## గోదావరి పుష్కరాలు 2027 నిర్వహణపైముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

- అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రుల కమిటీతో పాటు వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించిన ముఖ్యమంత్రి







**అమరావతి,కలంకౌంటర్ :** అత్యంత ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశాలు 2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును కూడా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సమీక్షలో వెల్లడించిన సీఎం ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలన్న ముఖ్యమంత్రి పుష్కరాల నిర్వహణతో పాటు రాజమహేంద్రవరం లాంటి నగరం ఓ మెగాసిటీగా అభివృద్ధి అయ్యేలా పనులు చేపట్టాలని సూచనలు కేవలం పుష్కరాలకు మాత్రమే పనులు పరిమితం చేయకుండా ప్రస్తుతం కల్పిస్తోన్న మౌలిక

- 3లో

## దేశ ప్రగతికి ఆరోగ్య సంరక్షణే కేంద్ర బిందువు: గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్

- డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ సంయుక్త స్నాతకోత్సవాలకు అధ్యక్షత వహించిన గవర్నర్













**విజయవాడ,కలంకౌంటర్ :** ఆరోగ్య సంరక్షణ దేశ ప్రగతికి కేంద్ర బిందువుగా మారిందని, నాణ్యమైన, అందుబాటులో ఉండే, అందరికీ సమానంగా చేరువయ్యే వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కులపతి జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ సంయుక్త

- 2లో

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన తప్పకుండా పోటీ చేస్తుంది

- 2029 ఎన్నికల్లో బీజేపీ మాతో కలిసి వస్తుందో లేదో తెలియదు
- మాపై విమర్శల వెనుక రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ఉన్నారని అనుకోను
- జనసేన అధినేత పవన్ కల్యాణ్



**తెలంగాణ,కలంకౌంటర్ :** తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన సీపీఎం, ఎంఐఎంలను ప్రశ్నించకుండా, కేవలం జనసేనను మాత్రమే ఎందుకు ప్రశ్నిస్తుండటంపై పవన్ కల్యాణ్ మండిపడ్డారు. తాను ప్రెస్‌మీట్ పెడితే శాంతిభద్రతల సమస్య అవుతుందా అని ప్రశ్నించారు. చచ్చిపోవడానికి సిద్ధపడే పార్టీ పెట్టానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వైఎస్ బతికి ఉన్నప్పుడు లేవని గొంతులు ఇప్పుడు లేస్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. తనపై విమర్శల వెనుక రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ఉన్నారని అనుకోవడం లేదన్నారు. పెచ్చుమీరుతున్న ప్రాంతీయవాదంపై కేంద్రం దృష్టిపెట్టాలని పవన్ సూచించారు. తెలంగాణకు వలసలు తగ్గాలంటే ఏపీ యువతకు ఉద్యోగాలు రావాలన్నారు. మంగళవారం హైదరాబాద్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. . హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో సాయంత్రం నాలుగన్నర నుంచి ఐదున్నర గంటల వరకు ప్రెస్ మీట్ జరిగింది. నవనిర్మాణం పేరుతో తెలంగాణ జనసేన నాయకులతో ఇవాళ పవన్ సమావేశం తలపెట్టారు. అయితే ఈ సమావేశానికి హైదరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. కనీసం ప్రెస్ మీట్ కు అయినా హైదరాబాద్ పోలీసులు అనుమతి ఇస్తారని భావిస్తున్నట్లు ఎక్స్లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు. ఈ మేరకు సాయంత్రం 4.30కు తన నివాసం ముందు ప్రెస్ మీట్లో పాల్గొన్నారు.

**ప్రాంతీయ వాదమే.. కాంగ్రెస్ వాదమా?:** ప్రాంతీయ వాదమే.. కాంగ్రెస్ వాదమా అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పద్ధతి అంటూ లేదన్నారు. జాతీయ పార్టీ ప్రాంతీయ వాదం గురించి మాట్లాడటం సరికాదన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు తీసుకుని వెళ్లాలా అని పవన్ ప్రశ్నించారు. మీరు భయపెట్టే కొద్దీ.. మా గుండె మరింత గట్టిపడుతుందని పవన్ స్పష్టం చేశారు.

**తెలంగాణలో మేం పోటీచేసి తీరుతాం:** తెలంగాణలో జనసేన ఉంటుంది, తమ పార్టీ నేతలు పోటీచేసి తీరుతామని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణ.. భారతదేశంలో

## మాస్కో చేరుకున్న విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్..





**మాస్కో,కలంకౌంటర్ :** నారా లోకేష్‌కు స్వాగతం పలికిన ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ నిఖిలేశ్ గిరి, ప్రవాసాంధ్రులు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్న మంత్రి నారా లోకేష్. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరం సమావేశంలో పాల్గొననున్న మంత్రి లోకేష్.

## ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేయడం అత్యంత దురదృష్టకరం: వైయస్ జగన్



**తాడేపల్లి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమలు దాదాపు నిలిచిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు వైద్యులు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌ను కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్‌ను నరసరావుపేట, గుంటూరు ప్రాంతాలకు చెందిన పలువురు వైద్యులు కలిసి రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగ పరిస్థితులు, రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో మాట్లాడిన వైద్యులు ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా అమలు కాకపోవడం వల్ల వేలాది మంది పేద రోగులు చికిత్సకు నోచుకోలేకపోతున్నారని తెలిపారు. ఆసుపత్రులకు మంజూరు చేసే ఎల్వోసీలు కూడా పారదర్శకంగా ఇవ్వకుండా, అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న కొన్ని ఆసుపత్రులకే ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. ఆరోగ్యశ్రీ పరిధిలో చికిత్స అందించాల్సిన వ్యాధులకు కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా నిధులు కేటాయిస్తూ, అందులో అవినీతి, కమీషన్లకు అవకాశం కల్పిస్తున్నారని వైయస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్పందించిన వైయస్ జగన్, పేదవాడికి కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందాలన్న మహోన్నత లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించి, మరిన్ని వ్యాధులను చేర్చడంతో పాటు చికిత్స అనంతరం విశ్రాంతి కాలానికి ఆర్థిక సహాయం, రోగులకు మెరుగైన సేవలు అందించేలా అనేక సంస్కరణలు చేపట్టామని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, గ్రామ స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు, నాడు-నేడు ద్వారా ఆసుపత్రుల అభివృద్ధి వంటి కార్యక్రమాలతో వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ తరఫున ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బాధితులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్సీపీ డాక్టర్స్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వైద్యులు కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శేషిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, హనిమిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకిరణ్, వసంత, చెన్నారెడ్డి, కొండారెడ్డి, జయభారత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, క్రాంతికుమార్, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# సర్ పై వర్క్ షాప్ లో చంద్రబాబు






**మంగళగిరి,కలంకౌంటర్ :** సర్ పై టీడీపీ కేంద్ర కార్యాలయంలో వర్క్ షాప్. హాజరై దిశా నిర్దేశం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. వర్క్ షాప్ లో పాల్గొన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, పరిశీలకులు.

## అమరావతి అంతర్జాతీయ చెస్ పోటీలకు మంత్రికి ఆహ్వానం



**తాడేపల్లి,కలంకౌంటర్ :** అమరావతిలో జూన్ 3న నిర్వహించనున్న 1వ అమరావతి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ ఓపెన్ అండ్ బిలో చెస్ టోర్నమెంట్స్--2026 కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని ముఖ్య అతిథిగా టోర్నమెంట్ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ మరియు వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో మంత్రి పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరచనున్నారు. రాష్ట్రంలో చెస్ క్రీడ అభివృద్ధికి ఇటువంటి అంతర్జాతీయ స్థాయి పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## పేదలకు నూతన వస్త్రములు పంపిణీ



**కందుకూరు, కలంకౌంటర్ :**,చేయి చేయి కలుపుదాం ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం అనే నినాదంతో మానవ సేవే మాధవ సేవ అంటూ శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పోకూరిసుబ్రమణ్యం,సుప్రజ( స్టైల్ జోన్ ఎమ్మిగనూరు ) దంపతుల సహకారంతో కందుకూరు పట్టణం విప్పగుంట రోడ్డులో ఉన్న కొంత మంది పేద పిల్లలకు నూతన వస్త్రములు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లిశ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవారత్న డాక్టర్ రవ్వా శ్రీనివాసులు , ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, ఈ.సి.మెంబర్ కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామికి ఆకు పూజ



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు పెద్ద బజార్ నందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో కోటి తులసి పూజ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆంజనేయ స్వామికి ఆకు పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు అనిల్ స్వామి ఆధ్వర్యంలో ఆకు పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం, స్వామివారి లక్షణామావళి పారాయణం చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## అమరావతిపై జగన్ వైఖరి బాధ్యతారాహిత్యం: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

- వైసీపీ ప్రభుత్వం అమరావతిని అల్లకల్లోలం చేసిందన్న రాంప్రసాద్ రెడ్డి
- అమరావతి రైతుల కుటుంబాలను ఇబ్బందులకు గురి చేశారని మండిపాటు
- అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వ్యాఖ్య



**అమరావతి,కలంకౌంటర్ :** రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత జగన్ అను-సరిస్తున్న వైఖరిపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో పర్యటించిన ఆయన.. అమరావతి గురించి జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవని మండిపడ్డారు. ప్రపంచ స్థాయి రాజధానిని ఐదేళ్ల పాలనలో అల్లకల్లోలం చేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని తెలిపారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టి, రాజధాని నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి.. ఇప్పుడు అభివృద్ధిపై నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ జగన్ తీరును ఎండగట్టారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతుల విశ్వాసాన్ని దెబ్బతీసి, వేలాది కుటుంబాలను గత వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా, ఇప్పుడు అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకున్న వారే అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ చేసిన విధ్వంసాన్ని సరిదిద్దుతూ, నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా, రాష్ట్ర గౌరవ ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వేగంగా అడుగులు వేస్తున్నాయని స్పష్టం చేశారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా రాజధాని నిర్మాణం కొనసాగుతుందని, దీనిపై జగన్ రాజకీయాలు చేయడం మానుకోవాలని మంత్రి హితవు పలికారు.

## జూన్ 3 నుంచి 5 వరకు కేరళం పర్యటనకు బయల్దేరిన మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్' (+వీ 2026) ఆంధ్రప్రదేశ్‌ను "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" (ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రం) గా ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కేరళలోని తిరువనంతపురంలో జరగనున్న 'జీటీఎం ఎక్స్ పో -2026'లో పాల్గొని, ప్రతిష్మాత్మకమైన 'మెట్రో ఎక్స్‌పెడిషన్ -- +వీ టూరిజం అవార్డు 2026' ను స్వీకరించేందుకు రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల కేరళం పర్యటనకు బయలు దేరారు. కేరళం పర్యటనలో భాగంగా జూన్ 3న తిరువనంతపురంలోని కోవాలం 'ఉదయ్ సముద్ర లీజర్ బీచ్ హోటల్ అండ్ స్పా'లో జరిగే జీటీఎం ఎక్స్ పో -2026 ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్ పాల్గొంటారు. అనంతరం జూన్ 4న తిరువనంతపురం 'గోల్డెన్ ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్'లో జరిగే ఎక్స్ పో కార్యక్రమాలకు హాజరవుతారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు కోవాలంలోని 'లీలా తిరువనంతపురం రావిజ్ హోటల్'లో జరిగే జీటీఎం అవార్డ్స్-2026 వేడుకలో దేశవిదేశాల ప్రముఖుల సమక్షంలో ఏపీకి దక్కిన "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" అవార్డును మంత్రి దుర్గేష్ అందుకోనున్నారు. ఆ తర్వాత జూన్ 5న తిరువనంతపురం నుండి ముంబయి పర్యటనకు బయలుదేరి వెళ్తారు. ఇది కూటమి ప్రభుత్వ దార్శనికతకు దక్కిన గౌరవం: మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. "ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దిశానిర్దేశంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారుల బృందం అంతర్జాతీయ స్థాయిలో చేసిన కృషికి దక్కిన అరుదైన గౌరవం ఇది. పర్యాటక రంగంలో మేం తీసుకొచ్చిన వినూత్న సంస్కరణలు, విప్లవాత్మక మార్పుల వల్లే ఈ రోజు జాతీయ స్థాయి ప్రశంసలు దక్కాయి" అన్నారు. ప్రధానంగా నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పన, అనుబంధ పాలసీలు అదే విధంగా 'బ్రాండ్ ఏపీ' ప్రదర్శనతో సోషల్ మీడియా, అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌పై ఏపీ పర్యాటక సౌందర్యాన్ని సరికొత్త శైలిలో బ్రాండింగ్ చేశామన్నారు. రాష్ట్రంలో టూరిజం యాక్టివిటీ పెంచేందుకు ఏడాది పొడవునా నిరంతరం ప్రతి జిల్లాలో పర్యాటక ఉత్సవాలు నిర్వహించామన్నారు. అంతేగాక సృజనాత్మక ఆలోచనలు, డిజిటల్ ప్రమోషన్స్ ద్వారా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించామన్నారు. కేరళంలో అందుకోబోయే ఈ జాతీయ అవార్డు ఏపీ పర్యాటక వైభవానికి ముగింపు కాదు.. ఇది ప్రపంచ స్థాయి విజయాలకు ఒక ఘనమైన ఆరంభం!" అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిజం బోర్డులు, హాస్పిటాలిటీ బ్రాండ్‌లు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొనే ఈ ఎక్స్‌పో ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరిన్ని పెట్టుబడులు, పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## మంత్రి సవితను కలిసిన విట్ యూనివర్సిటీ ప్రతినిధులు



**తాడేపల్లి,కలంకౌంటర్ :** క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖా మంత్రి ఎస్.సవితను విట్ యూనిర్శిటీ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యూనివర్శిటీలో జరిగే చెస్ ఛాంపియన్ షిప్ ప్రారంభ వేడులకు హాజరుకావాలని మంత్రివర్యులు కోరారు.



ఇందుకు మంత్రి సవిత సానుకూలంగా స్పందించారు. వారితో పాటు పలువురు సందర్శకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మంత్రివర్యులు సవితను కలిసి వినతి పత్రాలు అందజేశారు. వాటిని మంత్రి సవిత... ఆయా సమస్యలపరిష్కారానికి హామీ ఇచ్చారు.

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన తప్పకుండా పోటీ చేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

అంతర్భాగమని, తాను ఇక్కడ పర్యటిస్తానన్నారు. దశాబ్దాల బెదిరింపులకు చరమగీతం పలుకుతామని, ప్రతి అన్యాయాన్ని ఎదుర్కొంటామన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వాళ్లు పదవుల్లో కూర్చున్నారని, ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకించిన వాళ్లు ఎమ్మెల్యేలు అయ్యారని పవన్‌కల్యాణ్ ఆరోపించారు. ఇది భారతదేశం అనుకున్నారా?.. పాకిస్థాన్, పాలస్తీనా అనుకున్నారా? అని పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. రాహుల్, ప్రియాంక దక్షిణాదిలో ఎక్కడైనా పోటీ చేయవచ్చని, ఇందిరాగాంధీ మెదక్‌లో, పీవీ నరసింహారావు నంద్యాలలో పోటీ చేయవచ్చు, కానీ ఇక్కడ తనకు తిరిగే హక్కు లేదంటారా అని మండిపడ్డారు.

**మీరు మమ్మల్ని భయపెట్టాలని చూస్తే భయపడే వాళ్లం కాదు:** తనను భయపెట్టాలని చూస్తే భయపడే వాడిని కాదన్నారు పవన్ కల్యాణ్. తెలంగాణలో ఎలా తిరుగుతావని కొందరు కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని అలాంటి వారిని పట్టించుకోనన్నారు. వైఎస్ బతికి ఉన్నప్పుడు ఇదే కాంగ్రెస్ నేతలు ఊడిగం చేశారని, తెలంగాణకు వ్యతిరేకమని వైఎస్ బహిరంగంగా చెప్పినా ఆయనకే ఊడిగం చేశారని పవన్ ఆరోపించారు. వైఎస్ఆర్ బతికి ఉన్నప్పుడు మీ గొంతులంతా ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ బీఆర్ఎస్ పెట్టి.. ఏపీకి వచ్చినప్పుడు స్వాగతించానని, జనసేన మాజీ నాయకులను బీఆర్ఎస్‌లోకి తీసుకున్నా స్వాగతించానని పవన్ గుర్తు చేసుకున్నారు.

**తెలంగాణలో ప్రతి సమస్యకు ఆంధ్రవారే కారణమా?:** తెలంగాణలో ప్రతి సమస్యకు ఆంధ్రవారే కారణమా అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తాను ఇప్పటివరకు ఒక్క తెలంగాణ నాయకుడిని కూడా ఒక్క మాట అనలేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని, ఎన్నోసార్లు తగ్గి ఉన్నానని గుర్తు చేశారు. ఒక విశ్లేషకుడి వ్యాఖ్యల వల్ల గొడవ మొదలైందని, అతనిపై కేసులు పెట్టిన విషయం మొదట్లో తనకు తెలియదన్నారు. తనకు తెలిశాక కేసులు వద్దు వదిలేయమని చెప్పానని స్పష్టం చేశారు. ఆ తర్వాత ప్రెస్‌మీట్ పెట్టి తనను తిట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పునర్నిర్మాణ సభ పేరు మా నేతలు పెట్టారు.. నేను పెట్టలేదు గతంలో మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీచేసే అవకాశం వచ్చినా చేయలేదు తెలంగాణలో మావాళ్లు గెలిస్తే చాలు.. నేను పదవులు కోరుకోలేదు తెలుగు ప్రజల ఐక్యతకు బూర్గుల రామకృష్ణారావు చిహ్నం.. బూర్గుల రామకృష్ణారావు విగ్రహాన్ని ఏపీ-తెలంగాణ హైవేపై పెట్టాలి ఏపీ-తెలంగాణ హైవేకు బూర్గుల రామకృష్ణారావు పేరు పెట్టాలి 11 రోజులు అన్నం తినలేదంటే.. తెలంగాణ వచ్చినందుకు కాదు.. విభజించిన తీరుకు...తెలంగాణ వచ్చినందుకు 11 రోజులు అన్నం తినలేదనడం సరికాదు తెలంగాణ నాయకులు ఎన్నిసార్లు ఆంధ్ర వాళ్లను తిట్టలేదు...తెలంగాణలో పని ఇప్పుడే మొదలుపెట్టాం.. ప్రజలు నమ్మేవరకు పనిచేస్తాం...పార్టీ ఎలా నడపాలో చెప్పడానికి వాళ్లెవరు? జై తెలంగాణ.. జైహింద్ అంటూ ప్రసంగం ముగించిన పవన్ కల్యాణ్

## లాటరైట్‌కు 'సేవింగ్ క్లాజ్' ఇవ్వండి... కిషన్ రెడ్డికి చంద్రబాబు లేఖ



**అమరావతి, కలంకౌంటర్ :** లాటరైట్ ఖనిజం వర్గీకరణలో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పుల వల్ల రాష్ట్రంలో తలెత్తిన ఇబ్బందులను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర గనుల శాఖామంత్రి కిషన్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. పెండింగ్‌లో ఉన్న గనుల లీజు దరఖాస్తుల విషయంలో వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు. లాటరైట్‌లో అల్యూమినియం శాతం 20 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, దాన్ని ఉప ఖనిజంగా కాకుండా బాక్సైట్‌గా (మేజర్ మినరల్) పరిగణించాలని కేంద్రం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఏపీలో గనుల లీజుల ప్రక్రియ పూర్తిగా స్తంభించిపోయిందని చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. కేంద్రం తెచ్చిన కొత్త నిబంధనల వల్ల, మైనర్ మినరల్ కింద ప్రాసెస్ చేస్తున్న 402 గనుల లీజు దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసినట్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. నిలిచిపోయిన వాటిలో 19 లెటర్ ఆఫ్ ఇంటెంట్, 113 ప్రభుత్వ భూములు, 255 అటవీ భూములు, 15 పట్టా భూములకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని వివరించారు. పాత నిబంధనల ప్రకారమే వందలాది మంది దరఖాస్తుదారులు అప్లికేషన్ ఫీజులు, భూముల కొనుగోళ్లు, అటవీ అనుమతుల కోసం ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. గతంలో మైకా, క్వార్ట్జ్, బారైట్స్ వంటి ఖనిజాలను మైనర్ నుంచి మేజర్ కేటగిరీకి మార్చినప్పుడు కేంద్రం 'సేవింగ్ క్లాజ్' ఇచ్చిందని గుర్తుచేశారు. అదే తరహాలో లాటరైట్ ఖనిజానికి కూడా సేవింగ్ క్లాజ్ వర్తింపజేసి, పెండింగ్‌లో ఉన్న 402 దరఖాస్తులను పాత నిబంధనల ప్రకారమే ప్రాసెస్ చేయడానికి రెండేళ్ల పాటు వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సడలింపు ఇస్తే దరఖాస్తుదారులకు ఆర్థిక నష్టం జరగదని, న్యాయపరమైన వివాదాలు నివారించవచ్చని తెలిపారు. సేవింగ్ క్లాజ్ అమలు చేస్తే సిమెంట్, ఐరన్ ఓర్, రోడ్డు నిర్మాణ పరిశ్రమలకు ముడిసరుకు కొరత లేకుండా ఉపాధి అవకాశాలు నిలబడతాయని చంద్రబాబు తన లేఖలో స్పష్టం చేశారు.

## దేశ ప్రగతికి ఆరోగ్య సంరక్షణే కేంద్ర బిందువు: గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్

(మొదటి పేజీ తరువాయి)

స్నాతకోత్సవాలకు ఆయన అధ్యక్షత వహించి స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతులు, ప్రజారోగ్య సేవల విస్తరణ ద్వారా ఈ లక్ష్య సాధనకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. వైద్య రంగానికి విశిష్ట సేవలను యూనివర్సిటీ అందించిందన్నారు.. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైద్య, ఆరోగ్య విజ్ఞాన విద్యలో విశిష్టమైన వారసత్వాన్ని నిర్మించుకుందని, వైద్యులు, దంతవైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు మరియు అనుబంధ ఆరోగ్య నిపుణులను తీర్చిదిద్దుతూ దేశ విదేశాల్లో ఆరోగ్య సేవల బలోపేతానికి దోహదపడిందని గవర్నర్ కొనియాడారు. విద్యార్థులు ప్రజాసేవ, మానవ గౌరవ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. డీఎండీసీ కేంద్రం ఏర్పాటు అభినందనీయం అని అన్నారు. విశ్వవిద్యాలయంలో సమీకృత వ్యాధి పర్యవేక్షణ కార్యక్రమం (IDSP) కింద ఏర్పాటు చేసిన "డిసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ ఇంటెలిజెన్స్ సెంటర్ (DMDC) "ను గవర్నర్ అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో వ్యాధుల అంచనా, విశ్లేషణ, నిర్ణయాల రూపకల్పనలో నిపుణులను తీర్చిదిద్దే ఈ కేంద్రం శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు యోగా, ధ్యానం సాధన చేయాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని, తగిన విశ్రాంతి, నిద్రకు ప్రాధాన్యత ఇవ్వాలని గవర్నర్ సూచించారు. శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించి, జీవితాంతం నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. 29వ స్నాతకోత్సవ ముఖ్య అతిథి, హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రుల అరిథ్మియా మరియు ఎలక్ట్రోఫిజియాలజీ సేవల డైరెక్టర్ డాక్టర్ సి. నరసింహన్‌కు గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. 30వ స్నాతకోత్సవంలో హైదరాబాద్ అపోలో ఆసుపత్రుల కార్డియాక్ సైన్సెస్ విభాగం డైరెక్టర్, హెచ్‌వోడీ డాక్టర్ పి.సి. రాత్ కు గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ యూనివర్సిటీ వార్షిక నివేదికను సమర్పించి విద్య, పరిశోధన, సాంకేతికత, విద్యార్థుల సంక్షేమ రంగాల్లో సాధించిన పురోగతిని వివరించారు. అనంతరం ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

## రాష్ట్రంలో మద్యం దుకాణాలు, బార్ల వద్ద ప్రకటన బోర్డుల నిషేధం

- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

**అమరావతి ,కలంకౌంటర్ :**రాష్ట్రంలో మద్యం దుకాణాలు, బార్ల వద్ద ఏర్పాటు చేసిన వివిధ ప్రకటన బోర్డులు, హోర్డింగులు, ఫ్లెక్సీలు తదితర అన్ని రకాల ప్రచార సామగ్రిని తొలగించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కమీషనర్ చామకూరి శ్రీధర్ కు తొలగింపు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన ఎక్సైజ్ శాఖ సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులకు, అసిస్టెంట్, డిప్యూటీ కమిషనర్లకు ఈ విషయంపై కమీషనర్ మార్గదర్శకాలు జారీ చేసారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ, మద్యం విక్రయ కేంద్రాలు, బార్ల వద్ద ఉన్న ప్రకటన బోర్డులపై నిషేధం అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల అమలులో ప్రతి ఒక్కరూ సహకరించాలని మద్యం దుకాణాలు, బార్ యాజమాన్యాలకు అధికారులు సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఎటువంటి ప్రకటనలు లేదా ప్రచార సామగ్రిని ఏర్పాటు చేసినా సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పవన్ ప్రెస్‌మీట్ పెడితే తెలంగాణ సీఎంకు అభ్యంతరమేంటి?: ఎంపీ రఘునందన్

రేవంత్ ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రెస్‌మీట్ పెట్టరా?
పక్క రాష్ట్రం వాళ్లు ఇక్కడ ప్రెస్‌మీట్లు పెట్టరా?
గతంలో కేసీఆర్ కూడా పక్క రాష్ట్రంలో సభలు పెట్టారు.
ఏపీ డిప్యూటీ సీఎం సభ పెడితే.. కాంగ్రెస్ నేతలు ఎందుకు ఉలిక్కి పడుతున్నారు.
: బీజేపీ ఎంపీ రఘునందన్

-తెలంగాణ,కలంకౌంటర్ :

# రూ.62.20 కోట్ల సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

● భూసార పరిరక్షణకు కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం ● రైతులకు పెట్టుబడి భారం తగ్గించి అధిక దిగుబడులే లక్ష్యం ● పచ్చిరొట్ట సాగుతో నేల సారం పెంపు, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు ● వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** రైతు సంక్షేమం, భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్--2026 సీజన్‌లో పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రైతులకు అవసరమైన మద్దతు అందిస్తోందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.62.20 కోట్ల సబ్సిడీని కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 91,918 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు కేటాయించగా, అందులో జీలుగ 50,311 క్వింటాళ్లు, జనుము 21,291 క్వింటాళ్లు, పిల్లి పెసర 20,316 క్వింటాళ్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 40,459 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు సరఫరా చేయగా, 19,667 మంది రైతులకు 5,687 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసి రూ.4.76 కోట్ల సబ్సిడీ ప్రయోజనాన్ని అందించినట్లు చెప్పారు. పచ్చిరొట్ట పంటలు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి వివరించారు. ఈ పంటలను భూమిలో కలపడం ద్వారా సేంద్రియ కార్బన్ శాతం పెరగడంతో పాటు నత్రజని నిల్వలు అధికమవుతాయని తెలిపారు. దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గి, రైతుల సాగు వ్యయం నియంత్రణలో ఉండటమే కాకుండా భూముల ఉత్పాదకత కూడా గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. సహజ, సేంద్రియ వ్యవసాయ విధానాల పట్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ పంటల ప్రాముఖ్యతను వివరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహానికి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. కృష్ణా, గుంటూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, ఏలూరు, బాపట్ల, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది రైతులు ఇప్పటికే లబ్ధి పొందినట్లు మంత్రి వెల్లడించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాల సరఫరాను మరింత పెంచి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని కేవలం జీవనాధార రంగంగా కాకుండా ఆదాయాన్ని పెంచే రంగంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. నాణ్యమైన విత్తనాల పంపిణీ, సబ్సిడీ పథకాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నీటి వనరుల సమర్థ నిర్వహణ, భూసార పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటే రైతు అభివృద్ధి చెందుతాడు.. రైతు అభివృద్ధి చెందితే రాష్ట్రం పురోగమిస్తుంది అనే సంకల్పంతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# ప్రకాశం ఇంజినీరింగ్ విద్యార్థినులకు జాతీయ స్థాయిలో గుర్తింపు

-- బీఈఎల్, ఐఐటీ తిరుపతిలో ఇంటర్న్‌షిప్‌లు




మహిత



కీర్తన

**కందుకూరు,కలంకౌంటర్ :** నాణ్యమైన సాంకేతిక విద్య, ఇండస్ట్రీ ఓరియెంటెడ్ ట్రైనింగ్, రీసెర్చ్ కల్చర్‌తో విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక సవాళ్లకు సిద్ధం చేస్తున్న ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్) మరో విశిష్ట విజయాన్ని నమోదు చేసిందని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తుది సంవత్సరం విద్యార్థినులు కీర్తన- భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), హైదరాబాద్, మహిత - ఐఐటీ తిరుపతిలలో ప్రతిష్ఠాత్మక ఇంటర్న్‌షిప్‌లకు ఎంపికై కళాశాలకు మరోసారి గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. ఇలా జాతీయస్థాయిలో ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థినులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, డేటా అనలిటిక్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఆటోనమస్ సిస్టమ్స్, రీసెర్చ్ మెథడాలజీస్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ పొందనున్నారు. అలాగే రియల్‌టైమ్ ప్రాజెక్టులు, ఇండస్ట్రీ స్టాండర్డ్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ టెక్నిక్స్, ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ అభివృద్ధి వంటి అంశాల్లో ప్రాక్టికల్ అనుభవాన్ని సొంతం చేసుకోనున్నారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. చదలవాడ రవికుమార్,సీఎస్ఈ(ఏఐ) విభాగాధిపతి డా. కె. సుబ్బా రెడ్డి, కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ వి. హరిబాబు, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# గోదావరి పుష్కరాలు 2027 నిర్వహణపైముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష







(మొదటిపేజీ తరువాయి)

వసతులు గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలన్న సీఎం పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాల పనులు రాష్ట్రంలో 212 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోన్న గోదావరి నది. పోలవరం జిల్లా గుండాలలో మొదటి పుష్కర ఘాట్. కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలోని గోవాలంక, పశ్చిమగోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మాణ ప్రతిపాదనలు మొత్తం ఆరు జిల్లాల్లో 525 ఘాట్లను పుష్కరాల కోసం సిద్ధం చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లతో సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు ఈసారి పుష్కరాల్లో పుణ్య స్నానాల కోసం 9 నుంచి 10 కోట్లమంది భక్తులు వస్తారని అంచనా. పుష్కర ఘాట్లు, రహదారులు, టెంట్లు, మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం పనులు చేపట్టేలా ప్రతిపాదనలు. రాజమహేంద్రవరం, నర్సాపురం సహా వివిధ పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ పరిధిలో రూ.1,974 కోట్ల వ్యయంతో 1, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో రూ.1,080 కోట్ల విలువైన 1140 పనులు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1991లో 1.2 కోట్ల మంది భక్తుల పుష్కరస్నానాలు. 2003లో 5 కోట్ల మంది, 2015లో నవ్యాంధ్ర ప్రదేశ్‌లో 4.86 కోట్ల మంది భక్తుల పుష్కర స్నానాలు. గత పుష్కరాల్లో ఒక్క రోజులో అత్యధికంగా 58.26 లక్షల మంది భక్తుల పుష్కర స్నానం. ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా ప్రస్తుతం 4.5 కిలోమీటర్ల మేర పొడవైన పుష్కర ఘాట్లు. కొత్తగా నిర్మించే వాటితో కలిపి ఘాట్‌ల పొడవు 9.9 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ప్రభుత్వం అత్యధికంగా తూర్పుగోదావరి , కోనసీమ జిల్లాల్లో 150కి పైగా పుష్కర ఘాట్ ల నిర్మాణం ఇప్పటికే రూ.211.97 కోట్లకు సంబంధించి 132 పనులకు అనుమతులు మంజూరు చేసిన ప్రభుత్వం ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, శానిటేషన్, తాగునీరు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచన సమీక్షకు హాజరైన మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, సీఎం సమీక్షలో పాల్గొన్న హోం మంత్రి అనిత, మంత్రి నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, వాసంశెట్టి సుభాష్ఈ సమీక్షకు హాజరైన సీఎస్ జి.సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, దేవాదాయ, వైద్యారోగ్యం, రవాణా, పర్యాటక, పురపాలక, పంచాయితీరాజ్, ఆర్థిక, జలవనరులు, పోలీసు శాఖల ఉన్నతాధికారులు.

# ఘనంగా ప్రారంభమైన యమునా పుష్కరాలు







**ఉత్తరప్రదేశ్,కలంకౌంటర్ :** మంగళవారం ఉత్తరప్రదేశ్లో ప్రారంభమైన యమునా పుష్కరాలకు నువ్వే తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తెలుగు ప్రజలు తరలివచ్చి పుష్కర స్నానాలు చేశారు ముఖ్యంగా ఆగ్రా, మదురై బృందావనంలో తెలుగువారి సందడి బాగా కనిపించింది. బృందావనంలోని కేసీ ఘాట్ మధురై లోని విశ్రాంఘట్లో ప్రజలు కిక్కిరిసిపోయారు. ఉదయం నుండి పుష్కర స్థానాలు ప్రారంభించి పెద్దలకు పిండ ప్రదానాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటన జరగకుండా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. తెలుగు వారు ఎక్కువగా పాల్గొనే ఈ పుష్కరాలలో పూజ నిర్వహించడానికి వందలాదిమంది పండితులు ఉభయ రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ 15 వార్డ్ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ దంపతులు మంగళవారం ప్రారంభం రోజున పుష్కర స్నానాలు చేసి పండితులకు ఆర్థిక సహాయం అందించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ముందస్తుగా చేసిన ఏర్పాట్లు వలన ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పుష్కర స్నానాలు చేయడం జరిగిందని లంకి శెట్టి తెలియజేశారు.

# 22-ఏ భూముల రిజిస్ట్రేషన్లపై ఎమ్మార్వో హెచ్చరిక

-తప్పుడు సర్వే నంబర్లతో చేసిన పత్రాలు చెల్లవు




**కావలి,కలంకౌంటర్ :** నెల్లూరు జిల్లా కావలి మండలంలో 22-ఏ (22A) జాబితా నుంచి విముక్తి పొందిన భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో కావలి ఎమ్మార్వో శ్రవణ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. గతంలో కొందరు వ్యక్తులు అసలైన సర్వే నంబర్లకు బదులుగా, వేరే సర్వే నంబర్లను చూపుతూ రిజిస్ట్రేషన్లు చేసుకోవడం, ఆస్తులను అమ్ముకోవడం జరిగిందని, అటువంటి తప్పుడు పత్రాలు ఏవీ చెల్లవని ఆయన స్పష్టం చేశారు.

**ఎమ్మార్వో వెల్లడించిన ముఖ్యాంశాలు: అసలైన సర్వే నంబర్లకే ప్రాధాన్యత:** భూమికి సంబంధించిన అసలైన సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే చట్టపరమైన ప్రాధాన్యత ఉంటుంది. తప్పుడు సర్వే నంబర్లతో చేసుకున్న రిజిస్ట్రేషన్లు చెల్లవు. ఆస్తి పంపకాల పేరుతో మోసాలు ఒకే ఇంటిని లేదా భూమిని నలుగురు వ్యక్తులు తమ ప్రయోజనాల కోసం వేర్వేరు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవడం గమనించామని, ఇలాంటి పద్ధతులు పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని ఎమ్మార్వో పేర్కొన్నారు.

**పత్రాలు మారినా ఫలితం లేదు:** దొంగ డాక్యుమెంట్లను సృష్టించి, ఆ ఆస్తిపై ఇంటి పన్ను (ఎశీబంవ ఖఇ) రసీదులు లేదా విద్యుత్ బిల్లులు వేరే పేర్లతో మార్చుకున్నా సరే, అవి అధికారుల వద్ద చెల్లుబాటు కావని ఆయన స్పష్టం చేశారు.


**ద్వంద్వ రిజిస్ట్రేషన్లకు చెక్:** ఒకే ఆస్తిపై రెండు మూడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తింపు ఉండదని, దీనిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూమి క్రయవిక్రయాలు లేదా రిజిస్ట్రేషన్లుచేసుకునేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కేవలం రికార్డుల్లో ఉన్న అసలైన సర్వే నంబర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మార్వో శ్రవణ్ కుమార్ సూచించారు. ఈ విషయంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన మరోసారి హెచ్చరించారు.

# విస్తృత ప్రజాభాగస్వామ్యంతోనే జనగణన ప్రక్రియ విజయవంతమవుతుంది

● సమాజ పురోగతికి జనగణనలో కచ్చితత్వం కీలకం

● మునగపాడులో క్షేత్రస్థాయిలో సెన్సస్-2027 కార్యకలాపాలను తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ





**విజయవాడ, కలంకౌంటర్ :** విస్తృత ప్రజాభాగస్వామ్యంతోనే జనగణన ప్రక్రియ విజయవంతమవుతుందనీ, సమాజ పురోగతికి జనగణనలో కచ్చితత్వం కీలకం అని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం జి.కొండూరు మండలం, మునగపాడు గ్రామంలో కలెక్టర్ లక్ష్మీశ పర్యటించి జనగణన--2027కు సంబంధించి ఇళ్ల జాబితా, ఇళ్ల గణన (హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్) దశ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సమాజ అభివృద్ధి కోసం జనగణన (సెన్సస్)లో కచ్చితత్వం అత్యంత ముఖ్యమని అందుకే దోష రహిత డేటా సేకరణకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. సెన్సస్-2027 కార్యక్రమం గతం కంటే భిన్నంగా పూర్తి డిజిటల్ విధానంలో నిర్వహించడం జరుగుతోందని కీలక దశ అయిన హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సస్ ను అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. జనగణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లే సమయంలో ప్రజలు సరైన, పూర్తి వివరాల ను తప్పనిసరిగా అందించాలని విజ్ఞప్తి చేశారు. జనగణన ద్వారా సేకరించే గణాంకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి, గృహ నిర్మాణం తదితర రంగాల్లో భవిష్యత్ కార్యాచరణకు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ వివరించారు. ఈ విషయాన్ని గుర్తుంచుకొని క్షేత్రస్థాయిలో సిబ్బంది నిబద్ధతతో పనిచేసి నాణ్యమైన డేటా సేకరణకు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట డ్వామా పిడి ఎ.రాము, స్థానిక ఇంచార్జ్ తహశీల్దార్ ఎంపిడివో బి.వి.రామకృష్ణ నాయక్ తదితరులు ఉన్నారు.

# కావలి ఉదయగిరిబ్రిడ్జి సెంటర్లో ప్రమాదం.. వ్యక్తి మృతి

**కావలి,కలంకౌంటర్ :** కావలి పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్లో మంగళవారం రోజున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ పై వెళ్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు అని తెలిపారు.

# కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్



**కావలి,కలంకౌంటర్ :** మంగళవారం రోజున కావలి పురపాలక సంఘ పరిధిలోని 10వ వార్డు అంబెద్కర్ నగర్ నందు కాలువ కల్వర్టు నిర్మాణ పనులను కావలి పురపాలక సంఘ కమీషనరు జి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షించుట జరిగినది. మరియు ఈ యొక్క కల్వర్టు నిర్మాణపనులను వేగవంతముగా పూర్తిచేయవలసినదిగా కావలి పురపాలక సంఘ ఇంజనీరింగ్ విభాగము వారికి ఆదేశములు జారీచేయుట జరిగినది. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు శిద్ధా








**ఉత్తరప్రదేశ్,కలంకౌంటర్** : వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యములో యమునా నదిలి పుష్కరాల సందర్భము గా బృందవన్ (ఉత్తర ప్రదేశ్) లో రాణా ప్రతాప్ ఘాట్ వద్ద జూన్ 2 వ తేదీ నుండి 13 వ తేదీ వరకు జరిగే నిత్యాన్న దాన కార్యక్రమాన్ని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు సిద్దా సూర్య ప్రకాష రావు ప్రారంభించారు

# పంచ్ ప్రభాకర్ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు




**తిరువూరు,కలంకౌంటర్** : తిరువూరు మండల ఆర్యవైశ్య అధ్యక్షులు జంగాల మురళి , ఆర్యవైశ్య సమాజం అధ్యక్షులు గుడిమెట్ల మురళి , ఆర్యవైశ్య మహాసభ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల ముత్య ప్రసాద్, నాళ్ళా సురేంద్ర ,పి.వి.రావు సమక్షంలో తిరువూరు లో వివిధ హోదాలలో ఉన్న ఆర్యవైశ్య ప్రముఖులు అమెరికాలో ఉండి ప్రపంచంలో ఉన్న ఆర్యవైశ్య సమాజం పై విషం కక్కుతూ అవమానకర వ్యాఖ్యలు చేసిన పంచ్ ప్రభాకరపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు దోసపాటి రవి , గుడిమెట్ల చిన్న వెంకటేశ్వరరావు , దారా రాము , కొత్తూరు రమేష్ ,భూమా సురేష్ ,నాగుబండి ప్రకాష్ రావు ,కుందా వెంకటేశ్వరరావు, గుడివాడ నరేంద్ర , గుడిమెట్ల రాము ,కొత్తగుండ్ల కాంతారావు , పరిశె రామలింగేశ్వర రావు , నాగుబండి రామకృష్ణ , సముద్రాల కిరణ్ కుమార్ ,బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# క్లీన్ స్వీప్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

● మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బి. కుబియా నాయక్





**మచిలీపట్నం,కలంకౌంటర్** : ఆపరేషన్ క్లీన్ స్వీ పు కార్యక్రమాలలో భాగంగా మచిలీపట్నం నగరం లోని మేజర్, మైనర్ డ్రైన్ల పూడికతీత పనుల కార్యక్రమం ప్రారంభించినట్లు మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బి. కుబియా నాయక్ అన్నారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ లో 45వ డివిజన్‌ఫైర్ స్టేషన్ పక్కన ఉన్న ఈడేపల్లి ప్రధాన డ్రైన్ పూడికతీత పనులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లు, పారిశుద్ధ్య కార్మికుల తో డ్రైన్లు పూడికతీత పనుల ను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బి. కుబియా నాయక్ మాట్లాడుతూ వర్షాకాలంలోపు మచిలీపట్నం నగరంలోని మేజర్, మైనర్ డ్రైన్ల నందు పూడిక తీత పనులు ముమ్మరం చేసాము అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీ పు కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులతో పాటు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనడం విశేషం అన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, పి. జ్వాలా దీప్తి, 45వ డివిజన్ సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ, మాచవరపు మానస తో పాటుగా తదితర సచివాలయ సిబ్బంది, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా ప్రతినిధి, ముదిగొండ శాస్త్రి, డివిజన్ స్వచ్ఛ సైనికులు, గంజాల రవికుమార్, కోమటి వెంకటేశ్వరరావు, జి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహశీలి జన్మదిన వేడుకలు








**మచిలీపట్నం,కలంకౌంటర్** : ఉమ్మడి కృష్ణా జిల్లా అకౌంటెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉడత్తు శ్రీనివాసరావు జన్మదినోత్సవం సందర్భంగా అన్నా క్యాంటీన్ లో పేదల కి భోజనం వడ్డించారు. అనంతరం స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో మిత్ర బృందం ఆద్వర్యంలో జన్మ దిన వేడుకలు జరిగాయి. తొలుత వాసవి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ మోట మర్రి బాబా ప్రసాద్,కార్పొరేటర్ శ్రీ అన్నం ఆనంద్, కలం కౌంటర్ దినపత్రిక అధినేత రవికుమార్, అవోపా వైస్ ప్రెసిడెంట్ పులవర్తి శ్రీనివాస్,తుమ్మలపల్లి శ్రీనివాస్, జయవరపు ప్రసాద్, పొట్టూరి కిరణ్, యండూరి శ్రీను, గాదె వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.



# ఈ ప్రచారంలో నేను కూడా పాల్గొంటాను... వీలుంటే ఈ-సైకిళ్లు ఉపయోగిద్దాం: చంద్రబాబు

● ఓటర్ల జాబితా స్పెషల్ రివిజన్‌పై అప్రమత్తంగా ఉండాలని కేడర్‌కు సూచన ● ప్రభుత్వ పథకాలపై జూన్ 25 నుంచి 45 రోజుల పాటు ఇంటింటి ప్రచారానికి పిలుపు ● తాను కూడా సైకిల్‌పై ప్రచారంలో పాల్గొంటానని వెల్లడి ● వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దు.. మళ్లీ మళ్లీ గెలవాలని హితవు



**అమరావతి, కలంకౌంటర్** : తెలుగుదేశం పార్టీ శ్రేణులు జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు 45 రోజుల పాటు పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. “సైకిల్ పవర్ చూపుదాం... ప్రజలకు చేరువవుదాం” అనే నినాదంతో ఇంటింటి ప్రచారం చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ ప్రచారంలో తాను కూడా పాల్గొంటానని, సైకిల్‌పైనే ప్రజలను కలుస్తానని ఆయన ప్రకటించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

**సైకిల్ పవర్ చూపుదాం.. ప్రజలకు చేరువవుదాం..** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని చంద్రబాబు సూచించారు. “జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు, 45 రోజుల పాటు ఇంటింటి ప్రచారం చేపట్టాలి. రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రతి గడపకు వివరించాలి. ఈ ప్రచారంలో భాగంగా సైకిళ్ల మీద వెళ్లి ప్రజలను కలవాలి. వీలైతే ఈ-సైకిళ్లు వాడాలి. నేను కూడా సైకిల్ మీదే ప్రచారంలో పాల్గొంటాను” అని ప్రకటించారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకోవడం, తాను నాలుగోసారి సీఎంగా కొనసాగడం వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల విజయాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ఆదేశించారు.

**కార్యకర్తల సంక్షేమమే పార్టీకి ముఖ్యం..** టీడీపీ అనేది అందరి పార్టీ అని, ప్రతి వర్గాన్ని ఓన్ చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. “సోషల్ రీ-ఇంజనీరింగ్‌తో పదవులు, సీట్లు కేటాయించాం. నామినేటెడ్ పదవుల్లోనూ ఇదే సూత్రాన్ని పాటిస్తున్నాం. కార్యకర్తల సాధికారత, సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ. మరణించిన కార్యకర్తల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా, వారి పిల్లల చదువులకు ప్రత్యేక పాఠశాల, నైపుణ్య శిక్షణతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. ప్రతి కార్యకర్త ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతైనా ఖర్చు చేస్తాం” అని భరోసా ఇచ్చారు. నాయకులు కూడా కార్యకర్తలను ఆదుకునే విషయంలో ఇదే విధంగా ఆలోచించాలని సూచించారు. గత ప్రభుత్వంలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో రాష్ట్రానికి పోయిన బ్రాండ్‌ను తిరిగి తీసుకొచ్చామని తెలిపారు.

**వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దు..** కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలకు ఆయన కీలక సూచనలు చేశారు. “కొత్త ఎమ్మెల్యేలు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు. మళ్లీ మళ్లీ గెలవాలి. అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ప్రజాప్రతినిధుల వ్యవహార శైలి కూడా ఓట్లను ప్రభావితం చేస్తుంది. ప్రజల కోసం ఎంత పని చేసినా నోరు అదుపులో పెట్టుకోకుంటే నష్టం జరుగుతుంది. కార్యకర్త నుంచి నాయకుడి వరకు ప్రతి ఒక్కరికీ క్యారెక్టర్, ట్రస్ట్ చాలా ముఖ్యం,” అని హితవు పలికారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com